సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అత్రేయపురం : వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి జంపన కృష్ణంరాజు, బంగారమ్మ దంపతులు (మురమళ్ల) రూ.లక్ష విరాళం అందించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,700,మధ్య డెల్టాకు 2,000,పశ్చిమ డెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 32.20అడుగులకు నీటి మట్టం చేరింది.

బాలలూ.. ప్రాజెక్టులు రూపొందిద్దామా..!

నేటి బాలలే..భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు.



II లో

న్యూస్‌రీల్

ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం అర్చకులు, వేద పండితులు నిర్వహించిన పూర్ణాహుతితో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు ముగిశాయి. స్వామివారి సన్నిధిలో చివరి రోజు పలు విశేష కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రిల ఆధ్వర్యాన అర్చకులు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజలతో శ్రీకారం చుట్టారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక వేదికపై అర్చకులు ఆశీనులను చేశారు. వేద మంత్రోచ్చారణ మధ్య పంచామృతాలతో స్వామికి అభిషేకం చేశారు. ప్రాయశ్చిత్త హోమం, మహాశాంతి హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కిరణ్ 12 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అష్టోత్తర నామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. పాలికలకు నివేదన, చక్రపొంగలి నివేదన, తీర్థగోష్ఠి నిర్వహించారు. తదనంతరం స్వామికి పల్లకీ సేవ, పవిత్రములు తీయుట, విశేష అర్చన చేశారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రముఖ పారిశ్రామికవేత్త జంపన సత్యనారాయణరాజు, దాత కేఎస్ఎన్ రాజు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ బైర నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ మాటల్లో నిలకడ శూన్యం

రాష్ట్ర అగ్రి మిషన్ మెంబర్ బాబి



అమలాపురం టౌన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాటల్లో నిలకడ శూన్యమని రాష్ట్ర అగ్రి మిషన్ మెంబర్ జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. పదేళ్ల నుంచి పౌరుషం, ఆత్మాభిమానం, నిజాయితీకి సంబంధించిన సిద్ధాంతాలను చెబుతూనే టీడీపీతో అనైతిక పొత్తు పేరుతో అడ్డదారుల్లో వెళుతున్నారని వ్యాఖ్యానించారు. బాబి అమలాపురంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. తనకంటూ ఓ విజన్, టార్గెట్ లేకుండా చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ఆయననే సీఎం చేయాలన్న పవన్ కళ్యాణ్ తపనను ఆత్మాభిమానం ఉన్న కాపులు గమనిస్తున్నారని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు అమలాపురం ప్రచార సభలో కొందరి కాపు నేతల పేర్లు ఉటంకిస్తూ వారు టీడీపీ మోచేయి నీళ్లు తాగుతున్నారని ఆరోపించారని బాబి చెప్పారు. ఇప్పుడు పవన్‌కళ్యాణ్ కూడా టీడీపీతో అంటకాగుతూ మోచేతి నీళ్లు తాగుతూ ఆ పార్టీకి సాగిలపడ్డారని జనం అనుకుంటున్నారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వాన్ని దింపడమే లక్ష్యం అంటూ ఆవేశంగా మాట్లాడే పవన్‌కళ్యాణ్ తన ప్రసంగాలు ప్రజలను ఎంత వరకూ ప్రభావితం చేస్తున్నాయో ఆలోచించలేకపోతున్నారన్నారు. తన సభలకు, యాత్రలకు వచ్చే జనాన్ని చూసి సంబరపడి పోయే ఆయన.. 2009 ఎన్నికలకు ముందు చిరంజీవి సభలకు ఇంత కంటే ఎక్కువ మంది జనం వచ్చిన సంగతిని మరచిపోకూడదని గుర్తు చేశారు. చంద్రబాబును సీఎం చేస్తానంటే ప్రజలు ముఖ్యంగా కాపు సామాజిక వర్గం అందుకు అంగీకరించే పరిస్థితి లేదన్నారు. ఇలాగే చంద్రబాబుతో సంబంధం కొనసాగితే ముందు ముందు బాబు అవినీతి మరకలు తనపై కూడా పడతాయని పవన్ తెలుసుకోవాలన్నారు.

అవార్డు గ్రహీత ప్రతాప్‌కు కలెక్టర్ సత్కారం



కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందుకున్న ప్రతాప్

సఖినేటిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ బోయి భీమన్న జీవిత సాఫల్య తొలి పురస్కారం అందుకున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను, కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం సత్కరించారు. ఈ మేరకు అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతాప్‌ను శాలువాతో కలెక్టర్ సన్మానించారు. కోనసీమ జిల్లా వాసిగా ప్రతాప్.. భీమన్న తొలి పురస్కారంతో పాటు, రూ.2 లక్షలు నగదు ప్రోత్సాహాన్ని అందుకోవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, సాహితీవేత్తలు బొంతు సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, మాకే బాలార్జున, జి.భీమారావు పాల్గొన్నారు.

హరివిల్లు ఒడిలో అరుదైన విడిది!

- సప్త విధాలుగా ఆకర్షించే కోనసీమ
- చక్కని అనుభూతిని మిగిల్చే సోయగాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



సాగరో హైలెస్సా

సాక్షి అమలాపురం: కోనసీమ అందాల సీమ. బంగాళాఖాతం తీరాన్ని ఆనుకుని.. సప్త నదీపాయల మధ్య కొలువైన సీమ. పచ్చని తివాచీ పరిచినట్టు ఉండే చేలు, కొబ్బరితోపులు, గోదావరి నదీపాయలు, వంపులు తిరుగుతూ పారే పంట కాలువలు, తెరచాప పడవలు, ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, మడ అడవులు, గోదావరి మధ్య లంక గ్రామాలు, మండువా లోగిళ్లు, రైతుల మకాంలు.. వీటన్నింటికీ మించి ఆత్మీయత, మమకారంతో కలిసిన ఆతిథ్యం ఇలా చెప్పుకుంటూ పోతే కోనసీమ పర్యాటకులకు స్వర్గధామం. రైతులు, కూలీలు, మత్స్యకారులు, మహిళల జీవనం విధానం, కట్టుబొట్టూ, పండగలు, పబ్బాలు, జాతరలు.. ఇలా ఇక్కడ అన్నింటా ఒక ప్రత్యేక ముద్ర. ఇటీవల కాలంలో గోదావరి, సముద్ర తీరంలో వెలుస్తున్న రిసార్ట్స్, రైతుల పొలాల వద్ద ఫామ్ హౌస్‌లు, పర్యాటక రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం వంటి చర్యల కారణంగా కోనసీమకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 'సప్త'వర్ణాల కోనసీమ.. పర్యాటకంగా కూడా 'సప్త'రకాలుగా ఆకట్టుకుంటోంది. సెప్టెంబరు 27 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం...

ఆధ్యాత్మికంగా..



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం

ఆధ్యాత్మిక రంగంలో కోనసీమ జిల్లాకు ప్రముఖ స్థానం ఉంది. లెక్కలేనన్ని ఆలయాలు, పురాణ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలు కోనసీమ సొంతం. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక విమానాలలో భక్తులు వస్తున్నారు. వీటితోపాటు అంతర్వేది లక్ష్మీ నర్సింహస్వామి, మందపల్లి శనీశ్వర స్వామి, అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

బౌద్ధులు.. రాజుల చారిత్రక ఆనవాళ్లు

చారిత్రాత్మక ప్రదేశాలలో పర్యాటకానికి వస్తే రామచంద్రపురంలో 17వ శతాబ్దం నాటి కోట ఉంది. మామిడికుదురు మండలం ఆదుర్రులో క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాటి పురాతన బౌద్ధ స్థూపాలున్నాయి. కపిలేశ్వరపురం జమీందార్ల పురాతన భవనాలు, రాజుల కోటలను తలపించే మండువా లోగిళ్ల ఇళ్లు పర్యాటకులకు ముచ్చటగొల్పుతాయి.




రామచంద్రపురం కోట

తీరం... అందాల హారం

సుదీర్ఘ సముద్ర తీరం, తీరం పొడవునా సహజ సిద్ధంగా ఏర్పడిన బీచ్‌లు, వేలాది ఎకరాల్లో విస్తరించిన సరుగుడు, కొబ్బరి, మామిడి తోటలు.. గోదావరి, కాలువలు కడలిలో కలిసే సంగమ ప్రాంతాలు... వాటి అందాలను వర్ణించేందుకు మాటలు చాలవంటే అతిశయోక్తి కాదు. అంతర్వేది, కేశనపల్లి, ఓడలరేవు, ఎస్.యానాం బీచ్‌లకు రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. దీనిలో ఎస్.యానాంలో వైట్ సాండీ బీచ్ ఒక అద్భుతం. వీటిని ఆనుకుని ఉండే పక్రభూములు... అప్పుడప్పుడు వచ్చే విదేశీ పక్షులు కోనసీమకే సొంతం.

సముద్రతీరం అందాలు →



మైమరపించే మడ అడవులు



మడ అడవులు

ఐ.పోలవరం మండలం భైరవపాలెం నుంచి అంతర్వేది సముద్ర తీరం వరకు నదీపాయలతోపాటు, మురుగునీటి కాలువలు సముద్రంలో కలిసే ప్రాంతాలలో ఉన్న మడ అడవులలో పర్యాటకం అద్భుతమనే చెప్పాలి. నదీ, కాలువ పాయల మధ్య మడ అడవులు మీదుగా సాగే ప్రయాణం మధురానుభూతిని పంచుతుంది.

అగ్రి టూరిజం



రైతు మకాం

పర్యాటకంలో ఇటీవల కాలంలో మంచి ఆదరణ లభిస్తోంది అగ్రి టూరిజానికే. దేశంలో కేరళలో మొదలైన ఈ పర్యాటకం విస్తరిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని ఐటీ వంటి రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు చేసే వారు ఒత్తిడి నుంచి బయటపడేందుకు అగ్రి టూరిజం బాట పడుతున్నారు. ఇటువంటి వారికి కోనసీమ అగ్రి టూరిజం ఒక అద్భుతం. పచ్చని తివాచీ పరచినట్టు ఉండే వరిచేలు, కొబ్బరి, అరటి తోటలు, లంక గ్రామాల్లో పలు రకాల పంటలు, పాడి, ఆక్వా చెరువులు, తోటల్లోని రైతుల మకాం (వ్యవసాయ శాలలు) విశేషంగా ఆకర్షిస్తాయి.

గోదావరి హొయలు

గోదావరి నదీ అందాల గురించి ఎంత వర్ణించినా తక్కువే. నది మధ్యలో లంక గ్రామాలు, వాటిలో సాగయ్యే పంటలు, ఇసుక తిన్నెలు, చెంగుచెంగున ఎగిరే కృష్ణ జింకలు, తెరచాప పడవలు, పంటులు, హౌస్‌బోట్లపై సాగే ప్రయాణం, నదీపాయలపై వంతెనలు.. గోదావరి కాలువలకు లాకులు, ఇలా చెప్పుకుంటూ పోతే గోదావరి హొయలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి

ఆతిథ్యం అద్భుతం

అతిథి మర్యాదంటేనే గోదావరి జిల్లాలు. మరీ ముఖ్యంగా కోనసీమ ఆహారం.. ఆతిథ్యానికి ఫిదా అవ్వాల్సిందే. పర్యాటకుల జిహ్వ చాపల్యాన్ని తీర్చే రకరకాల స్వీట్లు, హాట్‌లు, టిఫిన్లు, బిర్యానీలు, మాంసహార కూరలు ఎన్నో.. ఎన్నెన్నో. ఆత్రేయపురం పూతరేకులు.. అవిడి పాలకోవా, మినప రొట్టి, చెరుకుపానకం, పెసరెట్టు ఉప్మా, పనస పొట్టు కూర, ముద్దపప్పు.. గుమ్మడి పులుసు, ఉల్లి గారెలు... నాటు కోడి కూర, చుక్కపీత ఇగురు.. పులసల పులుసు ఇలా ఎన్నో రకాల వంటకాలు పర్యాటకులను లొట్టలు వేయిస్తాయి.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



పర్యాటకాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. చిర్రయానాం నుంచి అంతర్వేది వరకు 19 బీచ్‌లను గుర్తించాం. వీటి అభివృద్ధికి ఆటంకం లేకుండా సీఆర్‌జెడ్ అనుమతులకు పంపాం. అనుమతులు రాగానే అభివృద్ధి పనులు మొదలవుతాయి.

– వి.స్వామినాయుడు, రీజనల్ డైరెక్టర్

మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు

డీఆర్‌డీఏ పీడీ శివశంకర వరప్రసాద్



ఆలమూరులో విలేకరులతో మాట్లాడుతున్న పీడీ శివశంకర వరప్రసాద్

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం మహిళ సాధికారతకు, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తుందని జిల్లా డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకరవరప్రసాద్ తెలిపారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏటా రూ.1000 కోట్ల వరకూ మహిళలకు రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ రుణాలను రెట్టింపు చేసి మహిళలను కుటీర, చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలను అందించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఈ జిల్లాలో ఉన్న 1,040 మంది యానిమేటర్లను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే విధంగా దశల వారీగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు 30 శాతం మేర రాయితీ ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ ఏడాది 550 యూనిట్ల స్థాపన లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 310 యూనిట్లు మంజూరు చేశామన్నారు. సున్నా వడ్డీ రాయితీని క్రమం తప్పకుండా డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళలు ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపన, బ్రిక్స్ తయారీ, ఎంబ్రాయిడరీ తదితర యూనిట్లు నెలకొల్పేందుకు వీలుగా వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పీడీ వరప్రసాద్ పేర్కొన్నారు.

స్త్రీ నిధి చెల్లింపులపై ప్రత్యేక దృష్టి

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలుగా ప్రభుత్వం స్త్రీ నిధి పథకం ద్వారా మంజూరు చేస్తున్న రుణాల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించామని పీడీ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఏడాది స్త్రీ నిధి పథకం కింద రూ.284 కోట్లు మహిళలకు రుణాలు ఇవ్వగా 90 శాతం రికవరీ సాధించి నూరు శాతం దిశగా కృషి చేస్తున్నామన్నారు. స్త్రీ నిధి రుణాలలో అలసత్వం వహించినా, నిధులు దుర్వినియోగం చేసినా సంబంధిత అధికారులు, యానిమేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డీవీఎల్ అన్నపూర్ణ, ఎంపీడీఓ కె.జాన్ లింకన్, ఏపీఎం ఎం.ధనరాజు పాల్గొన్నారు.

ట్రయల్ రన్ పరిశీలన

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్



ఈదరపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వైద్య శిబిరాల నిర్వహణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ సమర్థవంతమైన నిర్వహణ కోసం కౌంటర్ల వద్ద ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం ఈదరపల్లిలోని అంబేడ్కర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ట్రయల్ రన్ సాగింది. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఏర్పాటు చేసిన పది కౌంటర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేషెంట్‌కు ఏ రకమైన వైద్య సేవలు అవసరమో గుర్తించి, రిఫర్ చేసిన శస్త్ర చికిత్సలు వారికి సమీపంలోని ఆసుపత్రులలో చేయించుకొనేలా ఆరోగ్యశ్రీ ద్వారా ప్రోత్సహించాలని చెప్పారు. సర్వేలో గుర్తించిన ఆరోగ్య స్థితిగతుల వివరాలు ఏఎన్‌ఎంలు లాగిన్‌లో నమోదు చేస్తూ వైద్యులకు ఆన్‌లైన్‌లో చేరవేయాలన్నారు. తద్వారా ఈ వైద్య శిబిరాలలో చికిత్సలు అందించే వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి మాట్లాడుతూ ఈ శిబిరాల్లో 14 రకాల ల్యాబ్ పరీక్షలతోపాటు 105 రకాల ఔషధాలను ఉచితంగా అందిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా రాష్ట్ర నోడల్ అధికారి ఈవూరు ప్రశాంత్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొర మాట్లాడారు. ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యేశ్వర రావు, సర్పంచ్ రాయుడు వరలక్ష్మి, అదనపు డీఎం అండ్‌హెచ్‌ఓ సీహెచ్‌వీ భరత్ లక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమలత, తహసిల్దార్ పరమట శ్రీ పల్లవి, ఎంపీడీవో జె.వెంకటేశ్వర రావు వైద్యులు వాసునాయక్, స్వర్ణ కమల, శాంతి లక్ష్మి పాల్గొన్నారు.

అక్టోబర్ 27న ముసాయిదా ఓటర్ల జాబితా

వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సత్తిబాబు

అమలాపురం రూరల్: భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024 షెడ్యూల్‌ను సవరించిందని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, సవరించిన షెడ్యూల్‌పై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్‌ఓ సత్తిబాబు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 1,641 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి అదనంగా 1,500 ఓటర్లు దాటిన చోట్ల, దూరభారాలను పరిగణనలో తీసుకుని మూడు పోలింగ్ కేంద్రాలను నూతనంగా ప్రతిపాదించామన్నారు. పట్టణ పోలింగ్ కేంద్రాల్లో రద్దీని తగ్గించేందుకు గ్రేటర్ కమ్యూనిటీలో ఎక్కువ ఓటర్లు ఉన్న అపార్టుమెంట్లను గుర్తించాలని ఎన్నికల సంఘం సూచించిందన్నారు. కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఆయా పట్టణ ప్రాంతాలను గుర్తించడానికి సర్వే నిర్వహించాలని సూచించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అక్టోబర్ 27 ఉంటుందని, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసే సమయం డిసెంబర్ 9 వరకు ఉంటుందన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 26 తేదీని నిర్ణయించారన్నారు. ఓటర్ల జాబితా తుది ప్రచురణ వచ్చే ఏడాది జనవరి 5న ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ అధికారులు డీఆర్‌డీఏ పీడీ వి. శివశంకర్ ప్రసాద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జీవీ సత్యవాణి, సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

వేదాలతో మానవ మనుగడ

శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభలో ఘనపాఠిల ఉద్బోధ



వేద స్వస్తి చెబుతున్న పండితులు

అమలాపురం టౌన్: మానవ మనుగడకు వేదాలే మూలం. వేదాలను మనం రక్షించుకుంటే అవి మన సనాతన ధర్మాన్ని రక్షిస్తాయని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ఘనపాఠిలు ఉద్బోధించారు. శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధర్యంలో అమలాపురం శ్రీ సత్యసాయి కల్యాణ మంటపంలో మంగళవారం వేద శాస్త్ర సభ నిర్వహించారు. వేదాల పరిరక్షణ నేటి తరానికి, యుగానికి ఎంతటి అత్యవసరమో ఘనపాఠిలు తమ ఉపన్యాసాలలో వివరించారు. వేద విద్యా భూషణ బిరుదాంకితులు డాక్టర్ చిర్రావూరి శ్రీరామశర్మ అధ్యక్షతన వేద సభ ప్రారంభమైంది. ఉదయం వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా దంపతులు స్థానిక శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో వామన పూజ నిర్వహించారు. వేద శాస్త్ర సన్మాన సభ కార్యదర్శి గుళ్లపల్లి వేంకట్రామ్ 60 ఏళ్లుగా సంస్థ వేద పరిరక్షణ కోసం ఏటా వామన జయంతి రోజున నిర్వహిస్తున్న వేద సన్మాన సభ గురించి వివరించి నివేదిక సమర్పించారు. వేద సభ వేదికపై ఆశీనులైన బ్రహ్మశ్రీ కడియాల సీతారామ ఘనపాఠి, శృంగేరి ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, తిరుపతి వేద విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర ఘనపాఠి, హైదరాబాద్‌కు చెందిన హరి సీతారామ మూర్తి సలక్షణ ఘనపాఠి, ఉయ్యూరు వేద శాస్త్ర పరిషత్ పరీక్షాధికారి విష్ణుభట్ల వేంకట సుబ్రహ్మణ్య ఘనపాఠి, రాజమహేంద్రవరానికి చెందిన తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజి, తిరుమల తిరుపతి దేవస్థానం సూపర్‌వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనపాఠి వేద వేదాంగ అధ్యయనం గురించి ఉపన్యసించారు. ఉపనిషత్తులు గురించి వివరిస్తూనే నాలుగు వేదాలు నాలుగు పాదాలై ప్రకృతిని నడిపిస్తున్నాయని అన్నారు. శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామి తాత అయిన 90 ఏళ్ల కుప్పా రామగోపాల యాజులు వేద సభకు ప్రత్యేక అతిథిగా విచ్చేశారు.

పులకించిన కోనసీమ

వేద ఉపన్యాసాలు ముగిశాక కడియాల సీతారామ ఘనపాఠి ఆధ్వర్యంలో వేద స్వస్తి జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 150 మంది పండితుల వేద స్వస్తితో కోనసీమ పులకించిపోయింది. వేదాభిమానులు శ్రావణానందంగా విన్నారు. అనంతరం పండితులకు సత్కారాలు నిర్వహించారు.

ప్రపంచాన్ని నడిపిస్తున్నవి వేదాలే



ప్రపంచాన్ని నడిపిస్తున్నవి వేదాలే. అవి అంతర్గతంగా ప్రకృతిని కూడా నడిపిస్తున్నాయి. మానవాళికి మేలు చేసే దిశగా వేదాలు చేసే మహత్కార్యం మాటల్లో చెప్పలేం. అలాంటి వేదాలను మనం రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– దువ్వూరి ఫణియజ్ఞేశ్వర ఘనపాఠి, ప్రొఫెసర్, తిరుపతి వేద విశ్వ విద్యాలయం

వేదాల ఆదరణ అత్యవసరం



సనాతన ధర్మం వేదాలతోనే నడుస్తుంది. రక్షింపబడుతోంది. వేదాలను ఆదరించడం, ఆచరించడం నేటి పరిస్థితుల్లో అత్యవసరం. శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ వేదాల పరిరక్షణకు 60 ఏళ్లుగా పడుతున్న తపన ప్రశంసనీయం.

– హరి సీతారామమూర్తి సలక్షణ ఘనపాఠి, హైదరాబాద్

జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి స్థల నిర్ణయం

రైతుబజార్‌ను పరిశీలించిన జేడీ సుధాకర్

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక పలు జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి స్థల సేకరణకు సన్నాహాలు మొదలయ్యాయి. అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో మెయిన్ రోడ్డు చెంత ఉన్న రైతు బజారులోని సువిశాల ఖాళీ స్థలంలో జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి అనువైన స్థలంగా ఉందని ఆ శాఖ విశాఖపట్నం ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ (జేడీ) పి. సుధాకర్ అన్నారు. రైతుబజార్‌ను ఆయన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కేఎస్‌వీ విశాలాక్షి, అమలాపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మార్కెటింగ్ డీఈఈ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ కమిటీ సెక్రటరీ వాసంశెట్టి రామకృష్ణ,రైతు బజార్ ఇన్‌చార్జి జి.గోవింద్‌తో కలసి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ బజార్ ప్రాంగణంలో ఉన్న సువిశాల స్థలాన్ని మార్కెటింగ్ శాఖ అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపడుతున్నారు. దీనికి ఆ శాఖ కమిషనర్ నుంచి ఆమోదం కోసం నివేదిక పంపిస్తున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఛరిష్మసాయి రుత్వి



అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని నిమ్మకాయల ఛరిష్మ సాయి రుత్వి ఎంపికైనట్టు హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. అంబాజీపేట హైస్కూల్‌లో సాయి రుతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అభినందించారు. అనపర్తిలో ఈ నెల 25న జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వాలీబాల్ పోటీల్లో ఛరిష్మసాయిరుత్వి అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఛరిష్మసాయిరుత్వికి శిక్షణ ఇచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, ఆశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబులను పలువురు అభినందించారు. ఇటీవల బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాండిచ్చేరీలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ -14 బాస్కెట్‌బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు చరిష్మ ఎంపికైన విషయం తెలిసిందే. బాస్కెట్‌బాల్‌తో పాటు వాలీబాల్‌లో కూడా రాణించడం పట్ల ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ, బీఎస్ఎన్ మూర్తి, విద్యార్థులు అభినందనలు తెలిపారు. అలాగే ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇసుకపట్ల సలోమి స్టాండ్ బైగా ఎంపికైనట్లు పీడీ ముత్యాల పవన్ కిషోర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన మహేష్, అశోక్

రాజోలు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన చింతలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న యార్లగడ్డ మహేష్, కొల్లు అశోక్‌ను ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య మంగళవారం అభినందించారు. విజయవాడలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో 80 కేజీల కేటగిరిలో మహేష్ రజత పతకం సాధించగా, అశోక్ 71 కేజీల కేటగిరిలో కాంస్య మెడల్ సాధించాడని హెచ్ఎం వివరించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలలూ..ప్రాజెక్టులు రూపొందిద్దామా..!

- 31వ నేషనల్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు సన్నాహం
- విద్యార్థులకు చక్కని అవకాశం
- పాఠశాలల నుంచి ప్రాజెక్టులకు ఆహ్వానం
- 29, 30 తేదీల్లో సైన్స్ టీచర్లకు జిల్లా స్థాయి ఓరియంటేషన్ తరగతులు

రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఎంబ్లమ్

రాయవరం: నేటి బాలలే.. భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు. తన గురువు సుబ్రహ్మణ్యన్ అయ్యర్ చెప్పిన సైన్స్ పాఠం డాక్టర్ అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్‌గా మారడానికి కారణమైంది. అందుకే చిన్నారుల చిట్టి మెదళ్లలోని గట్టి ఆలోచనలకు పదును పెట్టి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. చిరుప్రాయం నుంచే చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేయగా, రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి జిల్లా సైన్స్ కాంగ్రెస్ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది.

ఐదు విభాగాల్లో పోటీలు

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని యాజమాన్యాల పరిధిలోని 6-12 తరగతుల విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023లో పాల్గొనేందుకు అర్హులు. పాఠశాలలకు వెళ్లే వారితో పాటు 10 నుంచి 17 ఏళ్ల లోపు బడి మానేసిన వారూ ఇందులో పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి వరకు 10-17 ఏళ్ల లోపు వారు పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 నుంచి 14 ఏళ్ల లోపైతే జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు వారిని సీనియర్లుగా విభజించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశం. జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన తేదీని త్వరలో తెలియజేస్తారు.

ప్రాజెక్టులు సిద్ధం చేసుకోవాలిలా..

- జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే నమూనాలుగా ఉండాలి. - విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు ప్రధాన అంశానికి లోబడి, ఏదేని ఉప అంశానికి చెంది ఉండాలి.
- ప్రాజెక్టు ద్వారా సమస్యకు నిర్దిష్ట కాలంలో పరిష్కారాన్ని కనుగొనలేక పోయినప్పటికీ అధ్యయన పద్ధతి మాత్రం శాస్త్రీయంగా ఉండాలి.
- సమస్య అవగాహన, సృజనాత్మకత, నూతనత్వానికి ప్రాధాన్యమివ్వాలి.
- ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా ప్రాజెక్టు నిర్వహించాలి.



గతేడాది జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రదర్శన

- చక్కని శీర్షికతో, సంబంధిత నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి. పరిశీలనలను తేదీల వారీగా లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. దత్తాంశాలన్నింటినీ విశ్లేషించాలి.
- పరిశోధన ఫలితాన్ని వివరించాలి. వ్యాఖ్యానించాలి..సమస్యకు పరిష్కారాన్ని సూచించాలి. ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో సమర్పించాలి.
- 250 పదాలకు మించకుండా ప్రాజెక్టు సంక్షిప్త రూపం రాయాలి.

29, 30 తేదీల్లో డివిజన్ స్థాయిలో అవగాహన

ఈ నెల 29న రామచంద్రపురం డివిజన్, 30న అమలాపురం డివిజన్‌లో జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్టుల తయారీ, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డివిజన్ స్థాయి సమావేశం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల, అమలాపురం డివిజన్ స్థాయి అవగాహన సమావేశం అమలాపురం మండలం కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సారథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించేందుకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా సైన్స్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం ఈ సమావేశాలకు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ప్రాజెక్టుల తయారీలో సూచనలు, సలహాలకు అకడమిక్ కోఆర్డినేటర్‌గా పీవీ బ్రహ్మానందం వ్యవహరించనున్నారు.

ఇవీ ప్రధాన, ఉప ప్రధాన అంశాలు

- ఈ ఏడాది ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడాన్ని ప్రధాన అంశంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది.
- మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోండి.
- ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు.
- స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలు ఉప అంశాలుగా తీసుకోవాలి.
- విద్యార్థులు ఈ ఐదు ఉప అంశాల్లో నమూనాలు సిద్ధం చేసుకోవచ్చు.

దరఖాస్తు చేయాలిలా..

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో నమూనాలు ప్రదర్శించడానికి ఆయా పాఠశాలలు ముందుగానే ఆన్‌లైన్‌లో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం(96401 88525)కు దరఖాస్తు చేసుకోవాలి.

సైన్స్ టీచర్ల మార్గదర్శకత్వం



ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి. ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు సైన్స్ టీచర్లే గైడ్ టీచర్లుగా వ్యవహరిస్తారు.

గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, జిల్లా కోఆర్డినేటర్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, అమలాపురం.


ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ప్రాతినిధ్యం



జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలకు ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాలి. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో హెచ్ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులదే ప్రధాన బాధ్యత.

- ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

గణపయ్యో గైకొనవయ్యా నైవేద్యాలు!



మొగలికుదురులో కరెన్సీతో వినాయకునికి అలంకరణ



మోరిపాలంలో వినాయకునికి సమర్పించిన వంటకాలు

మామిడికుదురు: గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా ఆదుర్రు శివారు మోరిపాలంలో విఘ్నేశ్వరునికి 190 రకాల వంటకాలు నివేదించారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 108 శివలింగాలకు అర్చన, జ్యోతిర్లింగార్చన ఘనంగా జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మొగలికుదురు జున్నూరి నగర్‌లో ఏర్పాటు చేసిన పృథ్వీ గణపతిని రూ.50 వేల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. 100, 50, 20 నోట్లతో గణపతి మంటపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

6 హోటళ్లకు నోటీసులు.. రూ.36 వేల జరిమానా

అమలాపురంలో ఆహార భద్రతాధికారుల తనిఖీలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో పరిశుభ్రత మార్గ దర్శకాలను పాటించని హోటళ్లు, స్వీటు దుకాణంపై జిల్లా ఆహార భద్రతా అధికారుల బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాసరావు, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీల బృందంలో డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి డాక్టర్ ఎస్.సునీల్, ఎంపీహెచ్ఈవో ఎం.రామలింగేశ్వరరావు ఉన్నారు. తనిఖీలు చేసిన ఆరు హోటళ్లు, ఒక స్వీటు దుకాణానికి పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న కారణాలతో మొత్తం రూ.36 వేలు జరిమానా విధించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని గ్రీన్ ట్రీ, విష్ణుశ్రీ, దుర్గాస్, బొండం బాబాయ్, ఆర్య, గణపతి హోటళ్లు, గణపతి స్వీట్ షాపులను అధికారులు తనిఖీ చేశారు. పలు హోటళ్లల్లో వంట పదార్థాల తయారీ గదుల్లో పరిశుభ్రత సరిగా లేకపోవడంపై ఆహార భద్రతాధికారులు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో కలిసి మాట్లాడారు. నోటీసులకు వారం రోజులు గడువు ఇచ్చాం. హోటళ్ల యాజమానులు తాము తనిఖీల్లో గుర్తించిన లోపాలను ఆ గడువులోపు సరిదిద్దుకుంటే సరి. లేని పక్షంలో హోటళ్ల మూసివేతకు చర్యలు చేపట్టమని మున్సిపల్ అధికారులకు సూచించామని చెప్పారు.



ఓ హోటల్ వంటగదిలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు తదితరులు


ముగిసిన గణపతి నవరాత్ర మహోత్సవాలు



పూర్ణాహుతితో చవితి ఉత్సవాలకు ముగింపు పలుకుతున్న పండితులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో చవితి మహోత్సవాల ముగింపు కార్యక్రమాలను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చవితి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్య నారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు, లక్షగరిక పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి పంచహారతులు ఇచ్చారు. వేదపండితుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమంతో చవితి మహోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్వామికి గ్రామోత్సవం జరిపారు. స్వామివారి ప్రసాదంగా ఉండ్రాళ్లు పంచారు. మేళతాళాల మధ్య స్వామిని ఊరేగించారు. బాణసంచా కాల్చారు. కేరళ వాయిద్యాలు, గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. తొమ్మిదో రోజు మంగళవారం రాత్రి 9.15గంటలకు పూజలు అందుకున్న మట్టి గణపతి విగ్రహాన్ని సమీప పంటకాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మద్యం మత్తులో వ్యక్తి హత్య



పరబ్రహ్మశాస్త్రి (ఫైల్)

కొత్తపేట: మద్యం సేవిస్తుండగా ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొమ్మూరి పరబ్రహ్మ శాస్త్రి (41) హత్యకు గురైన దుర్ఘటనపై కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాస్త్రి పిడుగురాళ్లలో ఆర్ఎంపీ వైద్యం చేస్తుండగా.. కాకినాడకు చెందిన గెద్దం నాగభూషణం పిడుగురాళ్లలో ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. వారిద్దరి మధ్య మూడేళ్ల క్రితం స్నేహం ఏర్పడింది. ఈ నెల 24న పరబ్రహ్మశాస్త్రి తను సహజీవనం చేస్తున్న భవాని అనే మహిళ, కొందరు స్నేహితులతో పాటు నాగభూషణంతో కలిసి కాకినాడ వచ్చాడు. ఆ పరిసర ప్రాంతాల్లోని పలు దేవాలయాలను దర్శించుకుని 26న ఉదయం కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చాడు. రాత్రి ఆ గ్రామ సచివాలయం వద్ద పరబ్రహ్మశాస్త్రి, నాగభూషణం మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. నాగభూషణం మద్యం బాటిల్‌తో శాస్త్రి నుదురుపై కొట్టి, ఛాతిపై పొడిచాడు. శాస్త్రి కేకలు వేయడంతో అతనితో వచ్చిన వారు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన శాస్త్రిని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతను అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని వారు మృతుని భార్య శారదకు ఫోన్‌లో తెలిపారు. ఆమె వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేయగా రావులపాలెం సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు హిజ్రాలకు జైలు

కాకినాడ లీగల్: తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఎన్‌హెచ్-16 రహదారిపై వెళుతున్న వాహనదారులను ఆపి వారి పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో కోరంగి పోలీసులకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్‌కుమార్ 24వ తేదీన కేసు నమోదు చేశారు. ఏడుగురు హిజ్రాలను మంగళవారం కాకినాడ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి 24 గంటల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్ వీరభద్రుడు తీర్పు చెప్పారు. హిజ్రాలను సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

రైలు ఢీకొని విద్యార్థిని మృతి



జాహ్నవి (ఫైల్)

అనపర్తి: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో మూసివేసిన ఉత్తర కేబిన్ రైల్వే గేటు వద్ద మంగళవారం రైలు ఢీకొని స్థానికంగా మూడో తరగతి విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మార్కండేయపురంలో నివాసముంటున్న కె.గంగాధరరావు, భవాని దంపతుల కుమార్తె జాహ్నవి(8) స్థానికంగా గల ఓ ప్రైవేటు స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. మంగళవారం స్కూల్ వదిలిన తరువాత తన తాతతో ఇంటికి తిరిగి వస్తున్న జాహ్నవి రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వెళుతున్న సూపర్ ఫాస్ట్ రైలును గమనించకుండా ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. వార్త తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో రైల్వే గేటు వద్దకు చేరుకున్నారు. కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.